క్లుప్తంగా

భారతీయ సంస్కృతికి వేదమే దిక్సూచి

ఆగిరిపల్లి: భారతీయ సంస్కృతికి వేదమే దిశా నిర్దేశం చేసేదని రాష్ట్ర మాజీ సీఎస్ ఎల్వీ సుబ్రహ్మణ్యం అన్నారు. ఆగిరిపల్లిలోని శ్రీ శోభనాద్రి వేద పాఠశాల 116వ వార్షికోత్సవంలో సుబ్రహ్మణ్యం, రాష్ట్ర దేవదాయ శాఖ ప్రధాన కమిషనర్ సత్యనారాయణ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆధునిక శాస్త్ర విద్య వల్ల ఫలితాలు అంతగా ఉండడం లేదని, ఇప్పుడు ఉన్న శాస్త్రవేత్తలు అందరికీ సంస్కృతం రాదని, వచ్చి ఉంటే భారతదేశం ఎప్పుడో అగ్రరాజ్యంగా అవతరించేదన్నారు. దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ ఆగిరిపల్లిలో వేద పాఠశాలను స్థాపించిన మార్కండేయ శర్మ కృషి వల్లే వేద పాఠశాల 116 సంవత్సరాలుగా ఎందరో ప్రముఖులను తయారు చేసిందన్నారు. ఆదాయ పన్ను శాఖ మాజీ డైరెక్టర్ రఘు పాల్గొన్నారు.

విశ్వేశ్వరయ్యకు నివాళి

పెనుగొలను(గంపలగూడెం): ప్రముఖ ఇంజినీర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి కార్యక్రమం పెనుగొలనులో షిర్డీ సాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. విశ్రాంత ఎంఈఓ వి. శేషిరెడ్డి, ప్రగతి స్కూల్ కరస్పాండెంట్ వెదురు వెంకటరెడ్డి, కుంచా కోటేశ్వరరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

● విస్సన్నపేట: లయన్స్ క్లబ్ ఆఫ్ విస్సన్నపేట ఆధ్వర్యంలో ఇంజినీర్స్‌డే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్ గాలీషా, పఠాన్ హసీనా, మేడా శ్రీనివాసరావులను సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు వీర్ల కిరణ్, లయన్స్ జిల్లా అంబాసిడర్ ఎన్టీ వెంకటేశ్వరరావు, ఆర్. వెంకటేశ్వరరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

వ్యాపార ప్రముఖుడు నాగుబండి రామారావు మృతి



తిరువూరు: తిరువూరు పట్టణ వ్యాపార ప్రముఖుడు నాగుబండి రామారావు (85) ఆదివారం మృతిచెందారు. ఆర్యవైశ్య సమాజంలో పలు కీలక పదవులు, పలు వ్యాపార సంస్థలను ఆయన నిర్వహిస్తున్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, వైఎస్సార్ సీపీ నాయకులు కాలసాని గోపాల నాగేశ్వరరావు, దేవిశెట్టి బాలకృష్ణ, వామపక్షాల నాయకులు, ఆర్యవైశ్య సంఘానికి చెందిన పలువురు బాధ్యులు నాగుబండి రామారావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆయన అంత్యక్రియలు స్వర్గపురిలో జరిపారు.

డీఎన్నార్‌కు పురస్కారం

ఇబ్రహీంపట్నం: మండల విద్యాశాఖలో పనిచేస్తున్న సీఆర్ఎంటీ (క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్) దొంతమాల నాగేశ్వరరావుకు రాష్ట్ర స్థాయి విశిష్ట సేవా విద్యా పురస్కారం లభించింది. విద్యా శాఖ, స్వచ్ఛంద సేవా సంస్థల ద్వారా సమాజానికి అందించిన సేవలను గుర్తించిన చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ కాకినాడలో ఆదివారం జరిగిన సదస్సులో పురస్కారం అందజేసి సత్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ అవార్డుకు 13 మందిని ఎంపిక చేయగా ఎన్టీఆర్ జిల్లా నుంచి దొంతమాల నాగేశ్వరరావు ఎంపిక కావడంపై ఎంఈఓ సీహెచ్ పుష్పలత, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు అభినందించారు.

238 మందికి వైద్య సేవలు

పెనుగొలను(గంపలగూడెం): తిరువూరు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో పెనుగొలనులో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. వైద్యులు జి. నరసింహారావు, ఏవీఎస్ ప్రసాద్, జి. మనోహర్, శ్రీనివాస బహదూర్, లక్ష్మణరావు, కేపీ వినాయక బాలాజీలు 238 మంది రోగులకు బీపీ, షుగర్, దంత, జనరల్ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. సేవా సమిత కన్వీనర్ దామెర ప్రభాకరరావు తదితరులు ఏర్పాట్లు చేశారు.

చెత్త తొలగించిన విద్యార్థులు

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో ఎన్ఎస్ఎస్ 3, 4, 6 యూనిట్లు, హెల్పింగ్ హ్యాండ్స్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం క్యాంపస్‌లోని చెత్త చెదారాన్ని తొలగించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు సైతం తొలగించి క్యాంపస్‌ను శుభ్రంచేశారు. ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ శ్రావణి, ఏఓ బి. లక్ష్మణరావు, జాజుల మధు పాల్గొన్నారు.

కన్నీరు మిగిల్చిన వరద

● నీటిలోనే నానుతున్న పంట పొలాలు
● కూలిన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు
● పంటలకు రూ.3.50 కోట్ల మేరనష్టం



ఈలప్రోలులో సముద్రాన్ని తలపిస్తున్న వరి పొలాలు



కొటికలపూడి లంక పొలాల్లో పత్తి పైరులో వేసిన ఇసుక మేటలు

ఇబ్రహీంపట్నం: ఇటీవల వచ్చిన కృష్ణానది వరద ప్రవాహానికి మండలం పరిధి గ్రామాల్లోని పంట పొలాలు నీటి ముంపునకు గురయ్యాయి. వరద ప్రవాహం తగ్గినప్పటికీ ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో పంటలు నీటిలోనే నానుతున్నాయి. వరి, పత్తి, మిర్చి, మొక్కజొన్న, అరటి, కంద, మినుము, పెసర తదితర పంటలు తుడిచిపెట్టుకు పోయాయి. లంకభూముల్లో అయితే పంటలు కనిపించకుండా ఇసుక మేటలు వేశాయి. ఇప్పటికే ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. మళ్లీ సాగు చేపట్టాలంటే ప్రభుత్వమే ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

రెండు వారాలకు పైగా నీటిలోనే..

వరద ప్రవాహం తగ్గినప్పటికీ ఈలప్రోలు గ్రామంలో 998 ఎకరాల వరి పంట రెండు వారాలకు పైగా నీటిలోనే నానుతోంది. ఇటీవల కేంద్ర బృందం సభ్యులు ముంపునకు గురైన వరిపైరును పరిశీలించారు. జూపూడి, కిలేశపురం, ఇబ్రహీంపట్నం, కొటికలపూడి గ్రామాల్లో వరి, మొక్కజొన్న, బెండ, పత్తి తదితర కూరగాయ పంటలు కుళ్లి ఎండిపోయాయి. పసుపు, అరటి పంటల ముచ్చలు కుళ్లి పోయాయి. ఎండిన పంటల స్థానంలో మరో పంట సాగు చేసుకునేందుకు పొలాలను రైతులు దున్నేస్తున్నారు. ఇంకా నీట ముంపులో ఉన్న రైతులు పొలం దున్నేందుకు ఎదురుచూస్తున్నారు.

ఉద్యాన పంటలకు నష్టం

లంక భూముల్లో పంటలు కనిపించకుండా ఇసుక మేటలు వేశాయి. లంకల్లో చేపట్టిన పత్తి, మొక్కజొన్న, పెసర, మునగ, మినుము. వివిధ రకాల కూరగాయలు ఇసుక మేటలతో కనిపించకుండా పోయాయి. బొప్పాయి, అరటి పంటలు సగానికి విరిగి ఎండాయి. మండలంలో 6,700 ఎకరాల్లో వ్యవసాయ పంటలకు గాను 5,200 ఎకరాలు, ఉద్యాన పంటలు 370 ఎకరాలకు గాను 260 ఎకరాల్లో నష్టం వాటిల్లింది. సుమారు రూ.3.50 కోట్ల మేర పంటలకు నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖాధికారులు అంచనాలు సిద్ధం చేశారు. వరదనీరు తగ్గడంతో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. దీంతో అంచనాలు ఇంకా పెరిగే అవకాశం ఉంది.

కూలిన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు

వ్యవసాయ భూముల్లో విద్యుత్ శాఖ గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు వరద ప్రవాహంతో విరిగిపోయాయి. మండలం వ్యాప్తంగా సుమారు 300 స్తంభాలు, 60 ట్రాన్స్‌ఫార్మర్లు, 20 కిలోమీటర్ల మేర విద్యుత్ లైన్లకు నష్టం వాటిల్లింది. వ్యవసాయ పొలాలు, లంక గ్రామాల్లో ఇప్పటికే 15 రోజుల నుంచి విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. పునరావాస కేంద్రాల నుంచి లంక గ్రామాలకు చేరిన ప్రజలు చీకట్లో కాలం వెళ్లదీస్తున్నారు. విద్యుత్ శాఖ వారు నూతన స్తంభాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టినప్పటికీ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు పూర్తి స్థాయిలో ఏర్పాటు చేసేందుకు మరో 20 రోజులకు పైగానే పడుతుందని చెబుతున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి



వరద ప్రభావానికి ఇబ్రహీంపట్నం సడక్ రోడ్డు వెంట వేసిన ఐదు ఎకరాల వరిపైరు పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. కాలువ ఆక్రమణలు కూడా ఒక కారణంగా కనిపిస్తోంది. నీటి ముంపుతో పంట పూర్తిగా కుళ్లిపోయింది. సుమారు రూ.1.50 లక్షల వరకు నష్టపోయా. ప్రభుత్వం ఆదుకుని రబీ సాగుకు విత్తనాలు, ఎరువులు ఉచితంగా ఇవ్వాలి.

– బొంతా సాంబశివరావు, రైతు, ఇబ్రహీంపట్నం

కోలుకోని రీతిలో నష్టం



మూలపాడులో ఎకరంన్నర బెండ, ఎకరంలో దోస సాగుచేశా. పంట చేతికి వచ్చే సమయంలో వరద ముంచుకొచ్చింది. రెండున్నర ఎకరాల్లో పంట పూర్తిగా పోయింది. పెట్టుబడి పెట్టిన సుమారు రూ.80 వేలు నష్టపోయా. మరలా ఏ పంట వేయాలో తెలియడం లేదు. ప్రభుత్వం రైతులకు ఎకరాకు రూ.30 వేలు వరకు పరిహారం అందివ్వాలి.

– గుడే శ్రీనివాసరావు, రైతు, మూలపాడు



కిలేశపురంలో వరద ప్రభావంతో ఎండిపోయిన వరిపైరు



త్రిలోచనాపురంలో ఎండిపోయిన అరటి తోట



చినలంక వద్ద వ్యవసాయ పొలంలో కూలిన ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ స్తంభం

కార్యకర్తలకు అండగా ఉంటాం

వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న గౌతమ్‌రెడ్డి

తిరువూరు: సార్వత్రిక ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వంలో ఇబ్బందులు పడే వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటామని పార్టీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పూనూరి గౌతమ్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశం స్థానిక సూర్యా ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగింది. గౌతమ్‌రెడ్డి మాట్లాడుతూ త్వరలో జరుగనున్న కృష్ణా–గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల చేర్పింపు ప్రక్రియ, నియమ నిబంధనలను ఆయన వివరించారు. తిరువూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలమైందని, సూపర్ సిక్స్ పథకాల అమలును విస్మరించడంతో పాటు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను సైతం పక్కన పెట్టిందని విమర్శించారు. అమ్మ ఒడి, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, చేయూత, ఆసరా తదితర పథకాల ఊసే లేదన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను అధికార పార్టీ నాయకులు ఇబ్బందులు పెడితే చూస్తూ ఊరుకోబోమని, ఇప్పటికే పలు ఘటనల్లో బాధితులకు తాము అండగా నిలబడ్డామని స్వామిదాసు వివరించారు. తిరువూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మద్దిరెడ్డి సూర్యనారాయణరెడ్డి, తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు, విస్సన్నపేట మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక

స్థానిక రాజుపేటకు చెందిన తెలుగుదేశం సీనియర్ నాయకుడు మేడిపల్లి ఏసుపాదం ఆదివారం గౌతమ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయనకు గౌతమ్‌రెడ్డి, స్వామిదాసులు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

గొర్రెల కాపరుల అభివృద్ధికి కృషి చేస్తా

మంత్రి పార్థసారథి



గొర్రెలకు నట్టల మందు వేస్తున్న మంత్రి పార్థసారథి

ముసునూరు: రాష్ట్రంలో మేకలు, గొర్రెల కాపరుల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తామని రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కె.పార్థసారథి అన్నారు. చింతలవల్లి శివారు గోగులంపాడులో ఆదివారం ఏర్పాటు చేసిన గొర్రెల వైద్యశిబిరంలో గొర్రెలకు నట్టల నివారణ మందులు, వ్యాక్సినేషన్ కార్యక్రమాలను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. గొర్రెలు, మేకల ఫాం ఏర్పాటు చేసుకునేవారికి సబ్సిడీపై రుణాలను ప్రభుత్వం అందిస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని కాపరులకు సూచించారు. అనంతరం దానామృతం రేషన్‌ను పంపిణీ చేశారు.

సాయమందించిన దాతలకు కృతజ్ఞతలు..

నూజివీడు: రాష్ట్రంలో వరద బాధితులకు సాయం అందించిన దాతలందరికీ మంత్రి కొలుసు పార్థసారథి కృతజ్ఞతలు తెలిపారు. ఆగిరిపల్లి మండలం కనసానపల్లికి చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు, మాజీ సర్పంచ్ కలిసి రూ.2,51,120 చెక్కును, చాట్రాయి గ్రామానికి చెందిన కె. చిన్నారావు, జి. శ్రీమన్నారాయణ కలిసి రూ.10 వేల చెక్కును మంత్రికి అందజేశారు.

బాధిత రైతులకు త్వరలో నష్టపరిహారం

ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వసంత

జి.కొండూరు: వరద ముంపు బాధిత రైతులకు త్వరలో నష్టపరిహారం అందిస్తామని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. జి.కొండూరు మండల పరిధి కవులూరు, వెలగలేరు, వెల్లటూరు, కోడూరు గ్రామాల్లో వరద ముంపునకు దెబ్బతిన్న వరి, పత్తి పైర్లను ఆదివారం ఆయన పరిశీలించారు. ధ్వంసమైన రహదారులు, కాలువలకు పడిన గండ్లను పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన గండ్లను పూడ్చడంతో పాటు రహదారుల మరమ్మతులను చేపడుతున్నామని చెప్పారు. అనంతరం వెల్లటూరు శివారు భీమవరప్పాడు గ్రామంలో అక్షయపాత్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిత్యావసరాల కిట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత..

మూలపాడు(ఇబ్రహీంపట్నం): మూలపాడు గ్రామంలో ఇటీవలి కాలంలో మృతి చెందిన నిమ్మగడ్డ భారతి కుటుంబ సభ్యులకు మూలపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సభ్యులు ఆర్థిక సహాయం చెక్కు మంజూరు చేశారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ పీఏసీఎస్ మంజూరు చేసిన రూ.లక్ష ఇన్సూరెన్స్ చెక్కును ఆమె భర్త నారాయణరావుకు ఆదివారం అందించారు. మృతురాలు పీఏసీఎస్‌లో రుణగ్రస్తురాలిగా ఉన్నందున ఆమె పేరుతో ఉన్న ఇన్సూరెన్స్ మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి



విస్సన్నపేట: గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే కె. శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులతో కలిసి ఎమ్మెల్యే ఆదివారం ఒక హోటల్ వద్ద అల్పాహారం తీసుకున్నారు. పెండింగ్ వేతనాలు చెల్లించలేదని పారిశుద్ధ్య కార్మికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లగా సర్పంచ్‌తో ఫోన్‌లో మాట్లాడి వేతనాలు మంజూరు చేయాలని సూచించారు. స్థానిక జెడ్పీ హైస్కూల్ వద్ద ఎన్నారై కొనకపూడి రామారావు సహకారంతో పీజీఎస్ పాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో వరద బాధితుల సహాయార్థం రూ.2 లక్షలు విలువైన నిత్యావసర సరుకులు, వస్తువులు, లక్ష రూపాయల చెక్కును ఎమ్మెల్యే సమక్షంలో అందజేశారు. వినాయకుడి పందిరిలో అన్నసమారాధన నిర్వహించారు.

అట్రాసిటీ కేసు సరికాదు

నూజివీడు: ఆగిరిపల్లి మండలంలో జనసేన జెండాపై మూత్ర విసర్జన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని, దీనిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ అక్రమ కేసు పెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని జనసేన ఉమ్మడి కృష్ణా జిల్లా అధికార ప్రతినిధి మరీదు శివరామకృష్ణ అన్నారు. నూజివీడులో ఆదివారం పార్టీ శ్రేణులతో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. నియోజకవర్గ సమన్వయకర్త బర్మా ఫణిబాబు ఒంటెత్తు పోకడల వల్ల, తప్పుడు కేసులు పెట్టడం వల్ల జనసేన పార్టీ పరువు పోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. జనసేన జెండాపై మూత్ర విసర్జన చేస్తే సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా కేసు పెడితే అందరం హర్షించే వారమని, ఇక్కడ పార్టీ విధానానికి వ్యతిరేకంగా ఘటనా స్థలంలో లేని వ్యక్తిని తీసుకొచ్చి అక్రమ కేసు బనాయించడం తప్పన్నారు.

వరద బాధితులకు అండగా..



నూజివీడులో నిత్యావసరాలు అందజేస్తున్న వ్యాయామోపాధ్యాయులు



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న మెండెం జమలయ్య

నూజివీడు: పట్టణంలోని పెద్దచెరువుకు గండ్లు పడి వరద ముంపునకు గురైన 21 కుటుంబాల వారికి నూజివీడు నియోజకవర్గంలోని హైస్కూళ్లలో పనిచేస్తున్న వ్యాయామోపాధ్యాయులు ఆదివారం నిత్యావసర వస్తువులు అందజేశారు. వ్యాయామోపాధ్యాయులు వాకా నాగరాజు, రవీంద్ర, లక్ష్మి, సుగుణరావు, సతీష్, పుల్లారావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

● ఇబ్రహీంపట్నం: సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఫెర్రీ రామాలయం వద్ద అన్నదానం చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.మహేష్ మాట్లాడుతూ దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగుతున్నాయన్నారు. సీఐటీయూ, సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

● విజయవాడరూరల్: వరద బాధిత 50 కుటుంబాలకు దళిత నాయకుడు మెండెం జమలయ్య ఆదివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. మెండెం నాగేశ్వరరావు మెమోరియల్ ట్రస్ట్ ద్వారా పాములకాల్వ వద్ద జక్కంపూడి గ్రామం వెళ్లే రోడ్డులోని బాధితులకు వీటిని అందజేశారు.



ఇబ్రహీంపట్నం రామాలయం వద్ద వరద బాధితులకు అన్నదానం

వేలంలో రూ.2.70 లక్షలు పలికిన లడ్డూ



నూజివీడు: నూజివీడు మండలం మిట్టగూడెంలో వినాయకుడి లడ్డూకు ఆదివారం పాట పెట్టారు. మాజీ సర్పంచి, వైఎస్సార్ సీపీ నాయకులు వెలివెల నాగేశ్వరరావు రూ.2,70,999కు పాడి లడ్డూను దక్కించుకున్నారు.

● చెక్కపల్లిలోని సుప్రసిద్ధ కోదండ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన తొమ్మిది కేజీల లడ్డూకు వేలం నిర్వహించగా ప్రముఖ బిల్డర్ కాటేపల్లి పవన్‌కుమార్ రూ.1,05,000కు దక్కించుకున్నారు. అనంతరం కమిటీ పెద్దలు, సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు.

అధ్వానంగా ఆర్‌అండ్‌బీ రహదారులు

చాట్రాయి: మండలంలో ఆర్‌అండ్‌బీ రోడ్లు అధ్వానంగా మారాయి. రోడ్లపై ప్రయాణం అంటే నరకయాతన పడాల్సి వస్తోంది. ధ్వంసమైన రోడ్లపై ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మండలంలోని చనుబండ నుంచి నరసింహారావుపాలెం, సి.గుడిపాడు, చిన్నంపేట, కోటపాడు, చీపురుగూడెం గ్రామాల వరకు ఆర్‌అండ్‌బీ రోడ్లు ధ్వంసం కావడంతో ప్రయాణాలు చేయలేకపోతున్నామని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు, వాహన చోదకులు కోరుతున్నారు.

కమ్యూనిస్టు నేత నారాయణరావు మృతి

ముసునూరు: సీపీఐ సీనియర్ నేత చదలవాడ నారాయణరావు శనివారం సాయంత్రం అనారోగ్యంతో మృతిచెందారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విజయవాడ ఆస్పత్రిలో చికిత్స పొంది ఇటీవల స్వగ్రామానికి తిరిగి వచ్చారు. ఆయన మృతదేహాన్ని కమ్యూనిస్ట్ పార్టీ నాయకులు కొమ్మన నాగేశ్వరరావు, చలసాని వెంకట రామారావు, అక్కినేని వనజ, కృష్ణచైతన్య, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, నియోజకవర్గ నేతలు సందర్శించి నివాళులర్పించారు.

సహస్ర దీపాలంకరణ

తిరువూరు: స్థానిక శ్రీ వేంకటాచలస్వామి ఆలయంలో శ్రవణ నక్షత్రం సందర్భంగా ఆదివారం సహస్ర దీపాలంకరణ సేవ నిర్వహించారు. వైష్ణవ గోష్టి సభ్యులు, మహిళా భక్తులు వెంకటాచలస్వామికి ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం సహస్ర దీపాలంకరణ చేశారు. ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బైబై గణేశా



గంపలగూడెం గాంధీసెంటర్‌లో నిమజ్జన ఊరేగింపు



గంపలగూడెం రెడ్డిబజారు విగ్రహం గ్రామోత్సవం



మైలవరం రాజాపేట నుంచి నిమజ్జన ఊరేగింపు



నూజివీడు పట్టణంలో వినాయకుడి ఊరేగింపు



నూజివీడులో వినాయకుడి ఊరేగింపులో నృత్యం చేస్తున్న చిన్నారులు



పర్వతాపురంలో వినాయకుడుకి పూజలు చేస్తున్న భక్తులు

గంపలగూడెం/నూజివీడు/మైలవరం: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణాలు, గ్రామాల్లోని ప్రత్యేక పందిళ్లలో పూజలందుకున్న గణనాథుని విగ్రహాల నిమజ్జనం కార్యక్రమం ఆదివారం పలుచోట్ల కోలాహలంగా జరిపారు. కోలాట ప్రదర్శన, మేళతాళాలు నడుమ భక్తులు ఆయా వాహనాల వెంట నడుస్తూ గణపతి బప్పా మోరియా అంటూ నినాదాలు చేస్తూ విగ్రహాలను తరలించారు. వెళ్లిరావయ్యా ఓ గణాధిపా అంటూ భక్తిశ్రద్ధలతో చెరువులు, కాలువల్లో నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా పలుచోట్ల వినాయక కల్యాణం, అన్నదానాలు జరిగాయి.